క్లుప్తంగా

భూముల రీసర్వేకు రైతులు సహకరించాలి



గ్రామసభలో భూముల చిత్రపటాన్ని చూపిస్తున్న డీటీ

తెర్లాం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా మండలంలో జరుగుతున్న భూముల రీసర్వేకు రైతులు సర్వే అధికారులు, సిబ్బందికి సహకరించాలని మండల డిప్యూటీ తహసీల్దార్ గొంగాడ సత్యనారాయణ అన్నారు. భూముల రీసర్వేకి సంబంధించి మండలంలోని పూనువలస గ్రామంలో బుధవారం గ్రామసభను సర్పంచ్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడారు. భూముల రీసర్వే పూర్తయితే గ్రామాల్లో భూముల సమస్యలు ఉండవని తెలిపారు. సమావేశంలో మండల సర్వేయర్ ఎం.వెంకటరమణ, వీఆర్ఓ, సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద పరిశీలన



జగనన్న గోరుముద్దను పరిశీలిస్తున్న ఎంఈఓ

రేగిడి: మండలంలోని ఉప్పరనాయుడువలస, చాటాయవలస, వన్నలి తదితర ప్రాథమిక పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు బుధవారం పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు వండి పెట్టాలని హెచ్ఎంలు, వంట నిర్వాహకులకు సూచించారు. రుచి, శుచికరమైన వంటలు వండాలన్నారు. వంట పదార్థాలపై మూతలు పెట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆయనతో పాటు హెచ్ఎంలు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఉపాధి పనులు



అప్పాపురం చెరువులో ఉపాధి పనులు

రేగిడి: మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. 39 గ్రామ పంచాయతీలకు సంబంధించి పనులు జరగాల్సి ఉండగా 20 గ్రామ పంచాయతీల్లో పనులు జరుగుతున్నట్లు ఏపీఓ ఎస్.హరనాథ్ తెలిపారు. మండలంలోని అప్పాపురం పంచాయతీలోని పేడకవాని చెరువులో జరుగుతున్న పనులను బుధవారం పరిశీలించారు. అనంతరం ఏపీఓ మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు రావాలని వేతనదారులకు సూచించారు. 2700 మంది వేతనదారులు ఉపాధి పనులు చేస్తున్నారని విలేకరులకు తెలిపారు.

మెనూలో లోపాలుంటే చర్యలు



గోరుముద్ద పథకాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా నిర్వాహకులు ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న మెనూను సక్రమంగా అమలు చేయకపోయినా, మెనూ అమలులో లోపాలు ఉన్నా చర్యలు తప్పవని ఎంఈఓ త్రినాథరావు హెచ్చరించారు. మండలంలోని అప్పలంపేట ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకాన్ని, మరుగుదొడ్లు, పాఠశాల రికార్డులు, విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళిక ప్రకారం విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్నదీ, లేనిది తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా ఉండవద్దని, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యా బోధన చేయాలని సూచించారు.

నిష్పక్షపాతంగా ఆడిట్ చేయాలి



సీఆర్పీల శిక్షణలో మాట్లాడుతున్న ఏసీ చిరంజీవి

రాజాం: క్లస్టర్ పరిధిలోని అన్ని గ్రామాల్లో మహిళా సంఘాల రికార్డులు ఆడిట్ జరుగుతుందని వెలుగు ఏసీ ఎ.చిరంజీవి అన్నారు. ఈ ఆడిట్‌ను నిష్పక్షపాతంగా నిర్వహించాలని సీఆర్పీలకు సూచించారు. బుధవారం స్థానిక మండల సమాఖ్య అధ్యక్ష కార్యాలయం వద్ద 26 మంది సీఆర్పీలకు నిర్వహిస్తున్న శిక్షణలో పాల్గొన్నారు. సంఘాలకు సంబంధించిన పుస్తకాల నిర్వహణ విధానం, సీఆర్పీలు పరిశీలించాల్సిన అంశాలు వివరించారు. ఏపీఎంలు దధికుమార్, ఎస్.అప్పలనాయుడు, కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రైతులకు మేలు చేసేలా చర్యలు
- ఈ క్రాప్ నమోదు వేగవంతం చేయాలి
- కలెక్టర్ సూర్యకుమారి



గిరిజన రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

రామభద్రపురం/బొబ్బిలి: అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతులకు అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ సూర్యకుమారి అన్నారు. రామభద్రపురం, బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయాలలో బుధవారం ఆమె ఈ క్రాప్ పంటల నమోదుపై సూపర్ చెక్ చేశారు. మండలం పరిధిలోని కొండకెంగువ, జీరికవలస, జన్నివలస గ్రామాలకు చెందిన రైతుల పండించిన పంటలకు ఈ క్రాప్ సూపర్ చెక్ చేశారు. మీరు పండించిన పంటలకు ఈ క్రాప్ అయిందా లేదా? ఏఏ పంటలు వేశారు? పంట కొచ్చిందా లేదా? పంటలు అమ్ముడవుతున్నాయా లేదా?అని ఆయా గ్రామాల రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పిల్లలంతా పాఠశాలలకు వెళుతున్నారా.. లేదా?పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాలకు టీచర్లు వస్తున్నారా.. లేదా? మెనూ ప్రకారం గుడ్లు, చిక్కీలు ఇస్తున్నారా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 104తో వైద్యాధికారులు గ్రామాలకు వస్తున్నారా.. లేదా? వైద్య పరీక్షలు చేస్తున్నారా.. లేదా? అవసరమైన రోగులకు ఉచితంగా మందులు ఇస్తున్నారా.. లేదా అని ప్రశ్నించారు. ప్రతీ రోజూ పిల్లలను పాఠశాలలకు పంపించాలని, మధ్యలో చదువులు ఆపకూడదని, ఏ సౌకర్యాలు కావాలన్నా ప్రభుత్వం కల్పిస్తుందని కలెక్టర్ సూచించారు. జీరికవలస తదితర గ్రామాలలో పలువురు ఇంటర్ చదివి మధ్యలో ఆపేశారని ఆ గ్రామ కుర్రాడు బోయిన ప్రవీణ్ తెలపగా అక్కడ ఎంత మంది ఉన్నారో గుర్తించి వృత్తి విద్యా శిక్షణ ఇప్పించాలని ఎంపీడీఓ రమామణిని ఆదేశించారు. గిరిజన రైతులంతా ఈ సమయంలో ఉలవల పంట ఎక్కువగా పండిస్తున్నామని, వ్యాపారులు గ్రామాలకు వచ్చి కొనుగోలు చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎఫ్‌వో ఏర్పాటు చేయాలని ఏపీఎం జి వెంటరమణను ఆదేశించారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ వ్యవసాయాభివృద్ధే లక్ష్యంగా రైతులకు అన్ని విధాలా అండగా ఉండేలా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతుందన్నారు. అందులో భాగంగానే ఈ క్రాప్ పంటల నమోదు కార్యక్రమం అమలు చేస్తుందని చెప్పారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 1,83,188 ఎకరాలు ఉండగా అందులో 1,20,114 ఎకరాలలో వివిధ పంటలు వేశారని, ఇప్పటి వరకు 72,915 ఎకరాలలో ఈ క్రాప్ పంటలు నమోదు పూర్తయిందని తెలిపారు. ఈ క్రాప్‌తో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందించే రాయితీల పథకాలు అందుకోవడంతో పాటు రైతు పండించిన పంటల విక్రయాల విషయంలో ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా సకాలంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా అమ్ముకుని అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శేషశైలజ, ఇన్‌చార్జి తహసీల్దార్ సుబ్బారావు, ఎంఈఓ తిరుమలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి చర్యలు



కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

తెర్లాం: మండలంలోని జగన్నాధవలస గ్రామంలో కొత్తగా నిర్మించిన మామిడి కాయల కలెక్షన్ సెంటర్ పక్కన రూ.12.50లక్షలతో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వెలుగు రాజాం క్లస్టర్ ఏరియా కో ఆర్డినేటర్ చిరంజీవి అన్నారు. జగన్నాధవలసలో మామిడి రైతుల ఉత్పత్తిదార్ల సంఘం మండల అధ్యక్షుడు గొందాల వెంకటరావు ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి అవసరమైన స్థల పరిశీలన బుధవారం చేశారు. స్థల పరిశీలనలో మండల వెలుగు ఏపీఎం టి.రాము, పూణేకు చెందిన ఓ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెలుగు ఏసీ మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి రూ.12.50లక్షలు అవసరం కాగా, ఉద్యానవన శాఖ ద్వారా 75శాతం, ఎఫ్‌పీఓ నుంచి 25శాతం నిధులు మంజూరవుతాయని చెప్పారు. ఈ నిధులతో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించి ఎఫ్‌పీఓ, పూణేకి సంబంధించిన సంస్థ ప్రతినిధులు ఎంఓయూ కుదుర్చుకోవడం జరిగిందన్నారు. నిధులు మంజూరు ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మామిడి రైతుల ఉత్పత్తిదార్ల సంఘం మండల అధ్యక్షుడు గొందాల వెంకటరావు, పూణేకి చెందిన ఎకో సారస్ సంస్థ ప్రతినిధులు కిరణ్‌బాబు, మోహన్‌రామ్, సచివాలయ ఉద్యానవన శాఖ సహాయకుడు బాబి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన రోడ్డు పనులు



పనులు ప్రారంభిస్తున్న కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: ఎప్పుడెప్పుడా.. అని ఎదురు చూస్తున్న రాజాం రోడ్డు విస్తరణ పనులు బుధవారం అధికారులు ప్రారంభించారు. ఇటీవల ఈ రోడ్డుకు సంబంధించి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శిలాఫలకాన్ని కూడా ఆవిష్కరించిన విషయం విదితమే. మున్సిపాల్టీ పరిధి చీపురుపల్లి రోడ్డులోని గాయత్రి కాలనీ నుంచి పాలకొండ రోడ్డులోని జీఎంఆర్ ఐటీ వరకు రోడ్డు విస్తరణ పనులు అధికారులు కొబ్బరికాయకొట్టి లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా గుర్తించిన విధంగా 80 అడుగులు మేర పనులు చేపట్టేందుకు కొలతలు వేశారు. రోడ్డుకు ఇరువైపులా తొలుత కాలువలు ఏర్పాటు చేసి తరువాత రోడ్డు పనులు చేపట్టనున్నామని ఆర్అండ్‌బీ ఏఈ నాగభూషణరావు తెలిపారు. గాయత్రి కాలనీ నుంచి బొబ్బిలి జంక్షన్ వరకు 3.4 కిలోమీటర్లు, పాలకొండ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకు 2 కిలోమీటర్లు మేర 80 అడుగుల విస్తరణ ఉంటుందని అన్నారు. విద్యుత్ స్తంభాల మార్పు, వాటర్ పైపులైన్లు మార్పుతోపాటు విస్తరణలో ఆస్తులు కోల్పోయిన వారి సమస్యలు పరిష్కరించి పనులు చేపట్టనున్నట్లు కమిషనర్ డీటీవీ కృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రత్నాకర్, కాంట్రాక్టర్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి పూజలు



వంగర: ఎం.సీతారాంపురంలో భగవద్గీత పారాయణం

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం గ్రామంలో భీష్మ ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమంలో శివరామదీక్షిత అచలగురుపీఠం 80వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలతో పాటు భగవద్గీత పారాయణ చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తెర్లాంలో..

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాల్లో భీష్మ ఏకాదశి పూజలు బుధవారం ఘనంగా జరిగాయి. మండలంలోని ఎస్.బూర్జవలస, బూరిపేట, అప్పలంపేట, కొల్లివలస తదితర గ్రామాల్లో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. రాములవారి చెట్టుకు దీపాలు వెలిగించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రేగిడిలో...

రేగిడి: మండలంలోని రేగిడి దత్తపీఠంలో బుధవారం ఏకాదశి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వేమకోటి ప్రసాద్‌శర్మ, వేమకోటి తిరుమలశర్మ పర్యవేక్షణలో పూజలు జరిగాయి.

ఘనంగా పూజలు

రాజాం: పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయ వీధిలో రాజగోపాలస్వామి ఆలయంలో బుధవారం ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. ఏకాదశి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. రాజగోపాలస్వామికి తులసిపత్రితో విశేష పూజలు అర్చకులు కుమ్మరిగుంట రామానుజాచార్యులు నిర్వహించారు. రాజాంతో పాటు పరిసర గ్రామాల భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ సానుభూతిపరులు

బొబ్బిలి: భవిష్యత్ ఎన్నికలలో పార్టీ విజయానికి పార్టీలో చేరిన వారంతా కృషి చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పల నాయుడు కోరారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బాడంగి మండలానికి చెందిన 9 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో బబుధవారం చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వానపల్లి భాస్కరరావు, వానపల్లి నర్సింహులు, తోట బెనర్జీ, తాడమ్మ, పార్వతమ్మ, వానపల్లి సత్యనారా యణ, సత్యారావు, బోనురాంబాబు, చప్ప శంకర్రావు ఉన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి మండల పార్టీఅధ్యక్షుడు శంబంగి వేణుగోపాల నాయుడు, బాడంగి జెడ్పీటీసీ పెద్దింటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

బొబ్బిలి: రెక్కాడితే గాని డొక్కాడని భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు కోరారు. మండలంలోని అలజంగిలో స్వామి వివేకానంద భవనం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం భవన నిర్మాణ కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.

చిన్నారులకు రామాయణ ఆవశ్యకత తెలియాలి

రాజాం సిటీ: ప్రతి ఇంట్లో చిన్నారులకు రామాయణం ఆవశ్యకతను తెలియజేయాలని పనసలవలసకు చెందిన వైష్ణవాచార్య పీఠాధిపతి తిరుమల రంగనాథం అన్నారు. మున్సిపాల్టీ పరిధి సారధి గ్రామంలో బుధవారం నిర్వహించిన విజయకోదండరామ ఆశ్రమ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. నేడు కుటుంబ వ్యవస్థ మరుగున పడిందని, దీని కారణంగా చిన్నారులకు మంచిచెడులు నేర్పే అవకాశం లేకుండా పోయిందని అన్నారు.

పోలిపల్లి పైడితల్లి హుండీ ఆదాయం రూ.1.72 లక్షలు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి హుండీ ఆదాయం బుధవారం లెక్కించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజకుమారి సమక్షంలో హుండీలు తెరిచి లెక్కించామని ఈఓ బీవీ మాధవరావు తెలిపారు. మొత్తం 62 రోజులకుగాను రూ.1,72,148లు సమకూరిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్చకులు వి.సూర్యనారాయణశర్మ, ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రాజాం సిటీ: మండల పరిధి దోసరిరామినాయుడువలస గ్రామానికి చెందిన కొర్రాయ అప్పన్న (37) పురుగుల మందు సేవించి మృతి చెందాడని ఎస్ఐ వై.రవికిరణ్ బుధవారం తెలిపారు. పిల్లలు పుట్టలేదని మనస్థాపంతో గత నెల 31 రాత్రి పురుగు మందు సేవించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ఎస్ఐ తెలిపిన వివరాలు మృతునికి అదే గ్రామానికి చెందిన కె.రామలక్ష్మితో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి అత్త వారింట్లో ఉంటున్నాడు. అప్పటి నుంచి పిల్లలు పుట్టలేదనే మనస్థాపంలో ఉన్న సమయంలో మృతుని మామ కొవ్వాడ అప్పలస్వామి ఏడు నెలల క్రితం మృతి చెందాడు. దీంతో ఇంటి పెద్దను కోల్పోయామని అప్పన్న మద్యానికి బానిసయ్యాడు. ప్రతి రోజు మద్యం సేవించడం ద్వారా నీకు ఏమైనా అయితే అనారోగ్యంగా ఉన్న నేను నీకు సేవ చేయలేనని భార్య రామలక్ష్మి వారించింది. నాకు పిల్లలు లేరు, నాకు అడ్డు చెప్పడమేమిటని గత నెల 31న రాత్రి ఇంట్లో పంట కోసం ఉంచిన పురుగుల మందు తీసుకుని రోడ్డుపైకి వెళ్లి తాగాడు. దీంతో కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి ఆటోలో రాజాంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడని, మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నవరత్నాలతో ప్రజా సంక్షేమం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే జోగులు



రెడ్డిపేటలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: నవరత్నాలతో ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం నాంది పలుకుతోందని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని రెడ్డిపేట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ఏయే పథకం కింద ఎంత లబ్ధి చేకూర్చిందో వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా, సమస్యలు ఏమైనా ఉన్నాయా, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది చక్కగా పని చేస్తున్నారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, కాలువలు నిర్మాణానికి సచివాలయం ద్వారా నిధులు మంజూరు చేయనున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు నేరుగా అందుతుండడంతో ప్రజలు ఎమ్మెల్యే ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్ల పాలనలో ఇచ్చిన హామీలను 90 శాతం నెరవేర్చారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశంలో ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీ టంకాల, మండల పార్టీ కన్వీనర్ వావిలపల్లి జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ పాండ్రంకి దుర్గారావు, మాజీ ఎంపీటీసీ కొవ్వాడ శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు వావిలపల్లి వెంకటరమణ, జేసీఎస్ కన్వీనర్ పాలవలస రామచంద్రినాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభిమానుల నడుమ పాలవలస పుట్టిన రోజు వేడుకలు



పాలవలసకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు తదితరులు

రాజాం: రాజాం పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు పుట్టిన రోజు వేడుకలు బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ పార్కు వద్ద ఆయన స్వగృహంలో ఈ వేడుకలు నిర్వహించగా, వందలాది మంది అభిమానులకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చారు. రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సతీమణి బెల్లాన శ్రీదేవితో పాటు కుమారుడు వంశీకృష్ణ, విశాఖపట్నం జీసీసీ ఎండీ గేదెల సురేష్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు తదితరులతో పాటు రాజాం పట్టణానికి చెందిన పలువురు అధికారులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు ఉచితంగా పలు రకాల వ్యాధులకు రక్తపరీక్షలు, షుగర్ పరీక్షలు నిర్వహించడంతో పాటు వైద్యులు తనిఖీచేసి ఉచితంగా మందులు అందించారు. రాజాం లైన్స్ క్లబ్‌తో పాటు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో 30 మందికి పైగా యువకులు పాల్గొని రక్తదానం చేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్ పాలవలస పద్మావతి, రాజాం పట్టణ వైఎస్సార్‌సీపీ అధికారప్రతినిధి ఆసపు సూర్యం, నల్లా శ్రీనివాసరావు, శాసపు వేణుగోపాలనాయుడు, చల్లా జయరాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవుడుబాబు జాతర



దేవుడుబాబు విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

రామభద్రపురం: మండలంలోని కొండకెంగువలో దేవుడుబాబు జాతర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. కమిటీ సభ్యులు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు, విశాఖపట్నం వారిచే ఈవెంట్స్, బేబీ డ్యాన్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జాతరకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి దేవుడుబాబును దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు వేలాది మందికి అన్నప్రసాద కార్యక్రమం చేపట్టారు.

హెల్మెట్ ధరించాలి : సీఐ



తెర్లాంలో హెల్మెట్ ధరించాలని కోరుతూ జరిగిన ర్యాలీ

తెర్లాం: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ద్విచక్ర వాహన చోదకులంతా తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలని బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ ఆర్.రమేష్ ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై బుధవారం అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాన్ని నడిపే ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలను మితిమీరిన వేగవంతో నడపవద్దని కోరారు. ఏఎస్ఐ, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లు, వాహన చోదకులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

రేగిడి: ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ శ్రీనివాసరావు సూచించారు. ఉంగరాడమెట్ట వద్ద జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఏఎస్ఐ రాజారావు పాల్గొన్నారు.

వంగరలో..

వంగర: వాహనం నడుపుతున్న వాహనదారులు హెల్మెట్ ధరించాలని ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు అన్నారు. ఎస్పీ ఆదేశాలు మేరకు బుధవారం హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ఉంటే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చునని అన్నారు.

రాజాంలో..

రాజాం సిటీ: ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ సూచించారు. పట్టణంలోని అవగాహనా ర్యాలీ బుధవారం నిర్వహించారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని అన్నారు. ఎస్ఐలు పి.సూర్యకుమారి, పి.నీలావతి, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.



తెర్లాం: నెమలాంలో వృద్ధాప్య పింఛనర్ గొల్లపల్లి అప్పలరాములమ్మకు బయోమెట్రిక్ వేలిముద్ర ద్వారా పెన్షన్ ఇస్తున్న వలంటీర్ గండి శివ

91 శాతం పింఛన్ల పంపిణీ



రామభద్రపురం: చొక్కాపు వీధిలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న వలంటీర్



రాజాం : కంచరాంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

రామభద్రపురం: మండల వ్యాప్తంగా సామాజిక పింఛన్ల పంపిణీ ఉత్సాహంగా బుధవారం సాగింది. గ్రామ వలంటీర్లు ఉదయం 5 గంటల నుంచే సచివాలయ కన్వీనర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ డబ్బులు అందజేశారు.

ఇంటింటికీ వెళ్లి..

తెర్లాం: మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక పథకంలో భాగంగా వివిధ రకాల పెన్షన్‌లకు పింఛనర్లకు అందజేశారు. మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో 9వేల 894 మంది వివిధ రకాల పెన్షన్‌దారులు ఉండగా, పెన్షన్ల పంపిణీ మొదటి రోజైన బుధవారం సాయంత్రం 4గంటలకు 8వేల 394మంది పెన్షనర్లకు పెన్షన్ డబ్బులను బయోమెట్రిక్ వేలిముద్ర, ఐరిష్ ద్వారా వలంటీర్లు అందజేశారు. పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ రామకృష్ణ పర్యవేక్షించారు.

రాజాంలో..

రాజాం: మండలంలో బుధవారం తెల్లవారుజాము నుంచే గ్రామ వలంటీర్లు ఫించన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కంచరాం, రాజయ్యపేట, ఆగూరు తదితర గ్రామాల్లో ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, ఈఓపీఆర్డీ వావిలపల్లి శ్రీనివాసరావు ఫించన్లు పంపిణీ పరిశీలించారు. మండలంలో 7936 సామాజిక ఫించన్లు ఉండగా, తొలిరోజు 6572 ఫించన్లు పంపిణీ పూర్తయింది.

పింఛన్ల పంపిణీ పరిశీలన

సంతకవిటి : మండలంలో బిళ్లాణి, తలతంపర, రంగారాయపురం తదితర గ్రామాల్లో పింఛన్ పంపిణీని బుధవారం మండల పరిషత్ అధికారి ఎస్.రఘునాథాచారి పరిశీలించారు. లబ్ధిదారుల వద్ద వివరాలు సేకరించారు.

86శాతం పింఛన్ల పంపిణీ

బాడంగి: మండలంలోని వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ చురుగ్గా సాగుతోంది. తొలి రోజు బుధవారం ఒక్క రోజులోనే 86 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్టు ఎంపీడీఓ అక్కారావు తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి

రాజాం సిటీ: అంగన్‌వాడీ కార్యకర్తలు అంకితభావంతో పని చేసి తమ నిబద్ధత చాటుకోవాలని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నియమితులైన అంగన్‌వాడీ హెల్పర్లకు నియామకపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలందించడంలో హెల్పర్ల పాత్ర కీలకమని అన్నారు. లబ్ధిదారులందరికీ అంగన్‌వాడీ ద్వారా అందుతున్న లబ్ధిని సక్రమంగా అందేలా చూసే బాధ్యత హెల్పర్లదేనని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బండి నర్సింహులు, రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు లక్ష్మణరావు, వావిలపల్లి జగన్మోహనరావు, నెల్లి పెంటన్నాయుడు, టంకాల ఉమాపాపినాయుడు, గెడ్డాపు అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

పాఠశాలల తనిఖీ

బాడంగి: పింద్రంగివలస, తెంటువలస, పెదపల్లి ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ కృష్ణమూర్తి బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు బాగుందని, విద్యార్థులలో పఠనా సామర్థ్యాలు, చదవడం, రాయడం వంటి అంశాలు సంతృప్తికరంగా ఉన్నాయని చెప్పారు.